# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## కరీంనగర్

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

సోమవారం 12 అక్టోబర్ 2026






## టీటీడీ ఆలయ నిర్మాణానికి శ్రీకారం

### ఈ నెల 17న ప్రారంభం కానున్న నిర్మాణ పనులు

- టీటీడీ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్

3 లో

# ఖాకీపై మచ్చలు



## కమిషనరేట్ లో వరుస ఆరోపణలు

- వాహనాల విడుదలకు లక్ష డిమాండ్
- చలాన్ల సొమ్ముపై కన్ను
- తోటి ఖాకీపైనే గంజాయి కేసు
- వేతనాల లెక్కల్లో గోల్‌మాల్
- బెదిరింపులు.. బ్లాక్‌మెయిల్
- దోపిడీ కేసుల ఛేదనలో సత్తా
- కొందరి తీరుతో శాఖకు మచ్చ

ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసు వ్యవస్థలో కొందరు సిబ్బందిపై వరుసగా వెలుగుచూస్తున్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. విధి నిర్వహణలో అక్రమ వసూళ్లు,అధికార దుర్వినియోగం, కేసుల విషయంలో అనుచిత జోక్యం, ఆర్థిక అవకతవకలు, మహిళలపై వేధింపులు వంటి అంశాలకు సంబంధించి పలువురు పోలీసు సిబ్బందిపై కేసులు, శాఖాపరమైన చర్యలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఇదే సమయంలో క్లిష్టమైన కేసులను సమర్థంగా ఛేదిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకొస్తున్న అధికారులు కూడా ఉన్నారు. కొందరి వివాదాస్పద వ్యవహార శైలి మొత్తం కమిషనరేట్ ప్రతిష్ఠకు మచ్చ తెస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

--కరీంనగర్ క్రైం, అక్టోబర్ 11, (ప్రజాజ్యోతి)

2లో

## మరిమడ్ల రైతుకు

# కరెంటు కష్టాలు..

### పంటను కాపాడేందుకు జనరేటర్!

- విద్యుత్ సమస్యతో రోజుకు రూ.5 వేల అదనపు ఖర్చు
- చేతికొచ్చే దశలో ఉన్న వరిని బతికించుకునేందుకు ఆకుల నారాయణ తాపత్రయం
- కోనరావుపేట మండలంలో విచిత్ర పరిస్థితి
- తక్షణమే సమస్యను పరిష్కరించాలని రైతుల డిమాండ్

4లో



## సింగరేణి సంస్థను కాపాడుకునేందుకే

# బీఆర్ఎస్ పోరాటం

- ఈనెల 14న రామగుండం లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభ
- మాజీ ఎంపీ, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్



4లో

# ఖాకీపై మచ్చలు



## కమిషనరేట్ లో వరుస ఆరోపణలు

**ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసు వ్యవస్థలో కొందరు సిబ్బందిపై వరుసగా వెలుగుచూస్తున్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. విధి నిర్వహణలో అక్రమ వసూళ్లు,అధికార దుర్వినియోగం, కేసుల విషయంలో అనుచిత జోక్యం, ఆర్థిక అవకతవకలు, మహిళలపై వేధింపులు వంటి అంశాలకు సంబంధించి పలువురు పోలీసు సిబ్బందిపై కేసులు, శాఖాపరమైన చర్యలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఇదే సమయంలో క్లిష్టమైన కేసులను సమర్థంగా ఛేదిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకొస్తున్న అధికారులు కూడా ఉన్నారు. కొందరి వివాదాస్పద వ్యవహార శైలి మొత్తం కమిషనరేట్ ప్రతిష్ఠకు మచ్చ తెస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.**

కరీంనగర్ క్రైం, అక్టోబర్ 11, (ప్రజాజ్యోతి)

### వాహనాల విడుదలకు బేరసారాల ఆరోపణలు,

అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే ఆరోపణలతో పట్టుబడిన ట్రాక్టర్లను విడిపించేందుకు భారీగా డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలు, పోలీసు శాఖలో కలకలం రేపాయి. తొలుత కొంత మొత్తం అడిగి, అనంతరం మరింత డబ్బు డిమాండ్ చేశారనే ఫిర్యాదులు రావడంతో తిమ్మాపూర్ సీఐ, ఎల్ఎండి ఎస్సైలపై ఉన్నతాధికారులు వారిని సస్పెండ్ చేయడంతో చర్చనీయాంశమైంది. కేసు నమోదు చేయకుండా డబ్బుల కోసం ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలు పోలీసుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తాయి.

### సహోద్యోగినే కేసులో ఇరికించే ప్రయత్నమా?

కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ పోలీసు సిబ్బందిపై గంజాయి కేసు నమోదు కావడం అప్పట్లో సంచలనం సృష్టించింది. టీజీఎస్పీ ఈగల్ బృందంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఇంట్లో 370.96 గ్రాముల గంజాయి లభించిందని పోలీసులు ప్రకటించారు. అయితే తనను కావాలనే కేసులో ఇరికించేందుకు కుట్ర జరిగిందని సంబంధిత వ్యక్తి వాదించినట్లు సమాచారం. ఈ వ్యవహారం పోలీసు సిబ్బంది మధ్య విభేదాలు ఏ స్థాయికి చేరాయన్న



చర్చకు దారితీసింది.

### చలాన్ల వసూళ్లలో చేతివాటం...

ట్రాఫిక్ విభాగంలోనూ అక్రమ వసూళ్ల ఆరోపణలు పోలీసు శాఖను ఇబ్బందుల్లోకి నెట్టాయి. నిబంధనలకు విరుద్ధంగా చలాన్ల డబ్బులు వసూలు చేసి రూ.34,700 వరకు అక్రమంగా వినియోగించుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో ఆర్ఎస్సైతో పాటు రైటర్, కోర్టు కానిస్టేబుల్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ప్రజల నుంచి జరిమానాల పేరుతో అదనపు మొత్తాలు వసూలు చేశారనే ఆరోపణలు రావడం మరింత విమర్శలకు తావిచ్చింది.

### జీతాల చెల్లింపుల్లోనూ అవకతవకలు...

కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన ఉద్యోగుల వేతనాల వ్యవహారంలో భారీ ఆర్థిక అవకతవకలు బయటపడటం పోలీసు శాఖలో కలకలం రేపింది.ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు సంబంధించిన లావాదేవీల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై కేసు నమోదు కాగా, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### మరణ ధ్రువీకరణ పత్రంపైనా ఆరోపణలు...

ప్రభుత్వ రికార్డుల్లో అత్యంత కీలకమైన మరణ ధ్రువీకరణ పత్రాల విషయంలోనూ అక్రమాలు వెలుగులోకి రావడం ఆందోళన కలిగించింది. నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం వ్యవహారంలో ఓ కానిస్టేబుల్‌పై కేసు నమోదైనట్లు సమాచారం. సాధారణ ప్రజల అవసరాలకు సంబంధించిన ప్రభుత్వ పత్రాల విషయంలో పోలీసు సిబ్బంది పాత్రపై ఆరోపణలు రావడం వ్యవస్థలో పర్యవేక్షణ లోపాలను ఎత్తిచూపింది.

- వాహనాల విడుదలకు లక్ష డిమాండ్
- చలాన్ల సొమ్ముపై కన్ను
- తోటి ఖాకీపైనే గంజాయి కేసు
- వేతనాల లెక్కల్లో గోల్‌మాల్
- బెదిరింపులు.. బ్లాక్‌మెయిల్
- దోపిడీ కేసుల ఛేదనలో సత్తా
- కొందరి తీరుతో శాఖకు మచ్చ

### ఒకే ఘటన.. రెండు ఎఫ్ఐఆర్‌లా?

కరోనా సమయంలో నమోదైన ఓ కేసులో ఒకే ఘటనకు సంబంధించి రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే ఆరోపణలు గతంలో వెలుగులోకి వచ్చాయి. కుటుంబ వ్యవహారంలో పోలీసుల జోక్యం, కేసుల నమోదులో నిబంధనల ఉల్లంఘన జరిగిందన్న విమర్శలు అప్పట్లో వినిపించాయి. చట్టాన్ని అమలు చేయాల్సిన వ్యవస్థలోనే విధి విధానాలపై సందేహాలు వ్యక్తమవడం చర్చకు దారితీసింది.

### ఇసుక వ్యవహారం నుంచి మరో వివాదం...

ఇసుక అక్రమ రవాణాకు సంబంధించిన వ్యవహారంలో ఓ ఎస్సైపై ఆరోపణలు రావడం, అనంతరం వరంగల్‌లో లైంగిక దాడికి సంబంధించిన కేసులో ఆయన పేరు తెరపైకి రావడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది. అధికారిక విధులు, వ్యక్తిగత ప్రవర్తనకు సంబంధించిన వివాదాలు వరుసగా బయటపడటం శాఖలో అంతర్గత పర్యవేక్షణ ఎంత పటిష్ఠంగా ఉందన్న ప్రశ్నను ముందుకు తెచ్చింది.

### కొందరి తప్పిదాలతో మొత్తం శాఖకు నష్టం...

ప్రజల్లో నమ్మకం పెంచేందుకు నిజాయతీగా పనిచేస్తున్న పోలీసు అధికారులు ఒకవైపు.. అదే శాఖకు చెందిన కొందరిపై అవినీతి, అక్రమ వసూళ్లు, అధికార దుర్వినియోగం లైంగిక వేధింపులు, కేసుల్లో జోక్యం వంటి ఆరోపణలు మరోవైపు వెలుగులోకి వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఆరోపణలు వచ్చిన ప్రతిసారి వేగవంతమైన విచారణ, వాస్తవాల ఆధారంగా చర్యలు, తప్పు చేసిన వారు ఎంతటి స్థాయిలో ఉన్నా ఉపేక్షించని వైఖరి ఉంటేనే పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



### స్నేహం ముసుగులో పరిచయం.. ఆపై బెదిరింపులు...

కరీంనగర్ పరిధికి చెందిన బెటాలియన్ కానిస్టేబుల్‌పై ఇటీవల లైంగిక దాడి, డబ్బుల కోసం బెదిరింపులకు సంబంధించిన కేసు నమోదైంది. స్కూల్ నుంచే పరిచయం ఉన్న వివాహితతో సన్నిహితంగా మెలిగిన కానిస్టేబుల్ ఏకాంత సమయంలో తీసిన దృశ్యాలను అడ్డుపెట్టుకుని డబ్బులు డిమాండ్ చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది.తన నుంచి రూ.1.30 లక్షలు తీసుకున్నాడని, ఓ హోటల్‌కు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆమె ఆరోపించింది. ఈ ఘటన పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.



### దోపిడీ కేసుల ఛేదనలో అదే ఖాకీ సత్తా...

ఒకవైపు కొందరు పోలీసు సిబ్బందిపై ఆరోపణలు వస్తుండగా మరోవైపు కరీంనగర్ పోలీసులు ప్రతిభను చాటిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. పీఎంజే, భగత్‌నగర్ దోపిడీ కేసులను వేగంగా ఛేదించి నిందితులను పట్టుకోవడంలో అధికారులు చూపిన చొరవ రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. క్లిష్టమైన దోపిడీ కేసును ఛేదించిన తీరును పోలీసు అకాడమీలో అధ్యయన అంశంగా చేర్చిన స్థాయిలో కరీంనగర్ పోలీసుల దర్యాప్తు సామర్థ్యానికి గుర్తింపు లభించింది.



# టీటీడీ ఆలయ నిర్మాణానికి శ్రీకారం

## ఈ నెల 17న ప్రారంభం కానున్న నిర్మాణ పనులు

- పది ఎకరాల విస్తీర్ణంలో అత్యంత వైభవంగా తిరుమల శ్రీవారి ఆలయం
- టీటీడీ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):**
కరీంనగర్ నగరంలోని పద్మనగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులకు ఈ నెల 17న శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదివారం టీటీడీ అధికారులతో కలిసి ఆలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. పనుల ప్రారంభానికి చేయాల్సిన ఏర్పాట్లు, ఆలయ నమూనాలు, ఇతర అంశాలపై అధికారులతో సుదీ-ర్ఘంగా చర్చించారు.

**అనుమతులు, భూమి రిజిస్ట్రేషన్ పూర్తి**

పద్మనగర్‌లో పది ఎకరాల విస్తీర్ణంలో ఆలయ నిర్మాణం కోసం భూమిని ఇప్పటికే టీటీడీ పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో టీటీడీ అనుమతులు పొందామని గుర్తుచేశారు. 2023 మే 31న భూమిపూజ నిర్వహించి ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం టెండర్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ ఎన్నికల నేపథ్యంలో పనుల్లో కొంత జాప్యం జరిగిందని వివరించారు.

**తిరుమలను తలపించేలా అద్భుత నిర్మాణం**

పద్మనగర్‌లో నిర్మించనున్న ఈ ఆలయాన్ని తిరుమల శ్రీవారి ఆలయాన్ని తలపించేలా సంప్రదాయబద్ధంగా రూపొందించనున్నట్లు గంగుల కమలాకర్ వెల్లడించారు. ప్రధాన ద్వారంతో పాటు గర్భాలయం, అర్ధమండపం, ముఖమండపం, గరుడాళ్వార్ తదితర ప్రత్యేక నిర్మాణాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. మూలవిరాట్టుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తి చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల వెంట నగర బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు చల్ల హరి శంకర్, నగర మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు గడ్డి ప్రదీప్ యాదవ్, గుగ్గిళ్ళ జయశ్రీ శ్రీనివాస్, టీటీడీ ఏఈ నాగరాజు, కాంట్రాక్టర్ మధుసూదన్ రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# యూట్యూబర్‌కు ఆపన్నహస్తం

- మెరుగైన వైద్యం కోసం దాతల సాయం
- ఆర్థికంగా ఆదుకోవాలని జుబేర్ ఖాన్ విజ్ఞప్తి

**కోరుట్ల, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):**
తన యూట్యూబ్ ఛానల్ ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న ఎంతోమంది బాధితులకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన కోరుట్లకు చెందిన యూట్యూబర్ జుబేర్ ఖాన్ ప్రస్తుతం బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న ఆయనకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఇప్పటికే తమ వద్ద ఉన్న సొంత డబ్బులన్నీ ఖర్చు చేశారు. మరింత వైద్య సాయం అందించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడంతో దాతలు, స్వచ్ఛంద సంస్థలు, సేవాభావం ఉన్న వ్యక్తులు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి ఆదుకోవాలని ఆయన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం అందించదలచిన దాతలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా నంబరు 62170694241 (IFSC Code: SBIN0020137, ఎండీ జుబైర్ ఖాన్) ద్వారా సాయం అందించాలని కోరారు.










# ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు: ఎస్సై శ్రీకాంత్

**బుగ్గారం, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా బుగ్గారం ఎక్స్‌రోడ్ వద్ద పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో రహదారికి ఇరువైపులా వాహనదారులకు అవరోధంగా మారిన చెట్ల కొమ్మలు, పొదలను తొలగించారు. మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని కోరిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# మరిమడ్ల రైతుకు కరెంటు కష్టాలు..

## పంటను కాపాడేందుకు జనరేటర్!



- విద్యుత్ సమస్యతో రోజుకు రూ.5 వేల అదనపు ఖర్చు
- చేతికొచ్చే దశలో ఉన్న వరిని బతికించుకునేందుకు ఆకుల నారాయణ తాపత్రయం
- కోనరావుపేట మండలంలో విచిత్ర పరిస్థితి
- తక్షణమే సమస్యను పరిష్కరించాలని రైతుల డిమాండ్

**కోనరావుపేట, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):** ఒకవైపు పెరుగుతున్న సాగు ఖర్చులు, మరోవైపు విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో రైతులకు అదనపు ఆర్థిక భారం తప్పడం లేదు. చేతికొచ్చే దశలో ఉన్న వరి పంట ఎండిపోకుండా కాపాడుకునేందుకు ఓ రైతు ఏకంగా జనరేటర్‌ను అద్దెకు తీసుకొచ్చి పొలానికి నీటిని పారిస్తున్నాడు. జనరేటర్ అద్దె, డీజిల్ ఖర్చులకే రోజుకు రూ.5 వేల వరకు వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో చోటుచేసుకుంది.

### లోడ్ సమస్యతో వైర్లు కాలిపోతున్నాయి..

మరిమడ్ల గ్రామానికి చెందిన రైతు ఆకుల నారాయణ, ఏకలవ్య గురుకుల పాఠశాల పక్కన ఉన్న తన వ్యవసాయ పొలంలో వరి సాగు చేస్తున్నాడు. అయితే విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, మోటార్‌పై లోడు ఎక్కువ కావడంతో తరచూ ఫ్యూజ్ వైర్లు కొట్టేస్తూ, కాలిపోతున్నాయి. ప్రస్తుతం వరి పంట గింజ పోసుకునే దశలో ఉ ందని, ఈ సమయంలో నీరు అందకపోతే పంట పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో జనరేటర్‌ను తెప్పించి మోటార్ నడుపుతున్నట్లు వివరించాడు.

### రోజుకు రూ.5 వేల అదనపు భారం

జనరేటర్ అద్దె రోజుకు రూ.2 వేలు కాగా, డీజిల్‌కు మరో రూ.3 వేలు ఖర్చవుతోందని రైతు ఆకుల నారాయణ తెలిపాడు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కూలీల రూపంలో వేల రూపాయల పెట్టుబడులు పెట్టామని, ఇప్పుడు పంట కాపాడుకోవడానికి రోజుకు రూ.5 వేలు అదనంగా ఖర్చు చేయడం భారంగా మారిందని కన్నీటిపర్యంతమయ్యాడు.

### స్పందించాల్సిన విద్యుత్ శాఖ అధికారులు

ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో సమస్యలు తాము అనుభవిస్తున్నామని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి, మరిమడ్ల పరిసర ప్రాంతాల్లో లోడ్ సమస్యను పరిష్కరించి సక్రమంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.

---

## సింగరేణి సంస్థను కాపాడుకునేందుకే

# బీఆర్ఎస్ పోరాటం




- ఆనాడు కేసీఆర్ గ్లోబల్ సంస్థగా మార్చాలని చూస్తే
- నేడు జేబు సంస్థగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలకులు
- సంస్థ రాష్ట్ర వాటాలో 10శాతం అమ్మాలనే ఆలోచన చేస్తుండ్లు
- కార్మికుల ప్రయోజనాల కోసం సింగరేణి కార్మిక గర్జన
- ఈనెల 14న రామగుండం లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభ
- మాజీ ఎంపీ, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్

**మంథని, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):** మన ప్రాంతాన్ని, మన సింగరేణి సంస్థను కాపాడుకోవాలన్నదే బీఆర్ఎస్ ఆలోచన అని, అందుకోసమే పోరాటం చేస్తున్నామని పెద్దపల్లి మాజీ ఎంపీ, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్ అన్నారు. ఆదివారం మంథని పట్టణంలోని రాజగృహ లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన సన్నాహక సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థను బడేబాయ్ నరేంద్ర మోడీ, చోటే బాయ్ రేవంత్‌రెడ్డి, మిడిల్‌బాయ్ కిషన్‌రెడ్డి ముగ్గురు కలిసి నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెరవెనుక చర్చలు జరుపుతూ సంస్థ 51శాతం రాష్ట్ర వాటాలో 10 నుంచి15శాతం అమ్ముదామా అనే ఆలోచన చేస్తున్నారని అన్నారు. రెండేళ్ల కాలంలోనే సింగరేణి సంస్థను నాశనం చేశారని, గతంలో కేసీఆర్ సింగరేణి సంస్థను మరింత విస్తరింప జేయాలనే గొప్ప ఆలోచనతో సీఎండీని అనేక దేశాలు పంపించి దేశంలోని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలనే గొప్ప ఆలోచన చేశారన్నారు. ఆనాడు కెసిఆర్ సంస్థను గ్లోబల్ ఆర్గనైజేషన్ చేయాలని చూస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం జేబు సంస్థగా మార్చుకున్నారని, ఇందులో అందరూ వాటాదారులేని, ముఖ్యమంత్రితో సహా మంత్రులు శ్రీధర్‌బాబు అడ్లూరి లక్ష్మన్, వివేక్‌లకు వాటాలు ఉ ండడంతోనే మాట్లాడడం లేదని ఆరోపించారు. ఈ ప్రాంత ఓట్లతో గెలిచిన వారు ఎందుకు మాట్లాడుతలేరో అర్థం చేసుకోవాలన్నారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడటం కోసమే బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని, ఇందులో బాగంగా ఈనెల 14న రామగుండం లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభ పెట్టినట్లు తెలిపారు. ఈ సభ ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి కార్మికులకు మేలు చేయాలన్నదే లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు మెడికల్ బోర్డు పెట్టలేదని, ఎవరైనా వెళ్తే వెనక్కి పంపిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 76జీఓ కింద 30వేల కుటుంబాలకు జాగలు ఇచ్చామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో జీఓ ద్వారా ఒక్కరికి పట్టా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కార్మికుల ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చారని, అందులో ఒక్కటి అమలు చేయకుండా కార్మిక లోకాన్ని మోసం చేశారన్నారు. అంతేకాకుండా సింగరేణి సంస్థ లాబాల్లో గణనీయంగా వాటాలు ఇచ్చిన చరిత్ర కేసీఆర్‌దేనని, కానీ నేడు లాబాల్లో వాటా చూపిస్తూ కోత విధిస్తూ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. ఈ క్రమంలో రామగుండంలో నిర్వహించే సింగరేణి కార్మిక గర్జనకు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- రాజరాజేశ్వర ఆలయంలో శైలపుత్రి అలంకారం
- భీమేశ్వరాలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు

**వేములవాడ, 2026 అక్టోబర్ 11 (ఏక్ దం న్యూస్):**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు, వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. మొదటిరోజు అమ్మవారు "శైలపుత్రి" అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కలశ ప్రతిష్ట, అఖండ దీపస్థాపన, శ్రీ రాజరాజేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం మరియు దేవీ చండీ



సప్తశతీ పారాయణాలు నిర్వహించారు. ఆలయ నిర్వహణాధికారి ప్రతాప నవీన్ కుమార్ ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో దేవీభాగవత ప్రవచనాలు, కన్యాక-సువాసినీ పూజలు మరియు పల్లకీ సేవ ఊరేగింపు నిర్వహించారు. భీమేశ్వర ఆలయంలో భక్తుల కోసం అక్టోబర్ 11 నుండి 20 వరకు ప్రత్యేక కుంకుమ పూజలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆలయ ప్రజాసంబంధాల అధికారి (పీఆర్ఓ) పెరిక శ్రీనివాస్ తెలిపారు. టికెట్ రుసుము రూ. 5,000గా నిర్ణయించినట్లు వెల్లడించారు.

# బహుజన అస్తిత్వ పోరాటాలను కొనసాగిద్దాం

- బహుజన బతుకమ్మను జయప్రదం చేయండి
- బహుజన బతుకమ్మతో అస్తిత్వ పోరాటాలకు బలం

**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 11 ప్రజా జ్యోతి:**

బహుజనుల అస్తిత్వం, హక్కుల సాధన కోసం పోరాటాలను కొనసాగించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం పిలుపునిచ్చారు. ఈ నెల 15న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప గుడి వద్ద నిర్వహించనున్న బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని అమరవీరుల స్తూపం వద్ద బహుజన బతుకమ్మ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో కార్పొరేట్ వ్యాపారం, ప్రశ్నపత్రాల లీకేజీల వంటి సమస్యలపై యువత పోరాటాలు ఉధృతమవుతున్నాయని పేర్కొన్నారు. యువతతో కలిసి దేశంలోని మౌలిక సమస్యల పరిష్కారం కోసం బహుజనులు ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు.ఈ నెల 15న జరిగే బహుజన బతుకమ్మ కార్యక్రమానికి నిర్మాణ కమిటీ చైర్మన్ కామ్రేడ్ విమలక్కతో పాటు అరుణోదయ సంస్థ బృందం ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో



ఏఐఎఫ్టీయూ జిల్లా నాయకుడు బుద్ధుల రమేష్, విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, అరుణోదయ రాష్ట్ర నాయకుడు సీహెచ్ యాకూబ్, తిర్రి బాలకృష్ణ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం, జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య, జిల్లా నాయకుడు కే. రాజు రాజు, బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్ల గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**వేములవాడ, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు వేములవాడ పట్టణంలో ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా మహిళలు, చిన్నారులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. ప్రకృతిని ఆరాధిస్తూ, ఆత్మీయతను చాటే ఈ పూల పండుగతో పట్టణమంతా సందడి వాతావరణం



నెలకొంది. రాబోయే రోజుల్లోనూ ఈ ఉత్సవాలు మరింత ఉత్సాహంగా కొనసాగనున్నాయి.

## బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా జోగేందర్

**సుల్తానాబాద్, అక్టోబరు 11 (ప్రజా జ్యోతి) :**

భారతీయ జనతా పార్టీ దళిత మోర్చా పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా సుల్తానాబాద్ మండలం పూసాల గ్రామానికి చెందిన కనుకుంట్ల జోగేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు మచ్చ విశ్వాస్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు.



ఈ సందర్భంగా జోగేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించేందుకు కృషి చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్, జిల్లా అధ్యక్షుడు మచ్చ విశ్వాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని, దళితుల సంక్షేమం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు



## వేములవాడలో వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం

**వేములవాడ, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**

వేములవాడ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు "శైలపుత్రి" అలంకారంలో దర్శనమివ్వగా, ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా అఖండ దీపస్థాపన, కలశ ప్రతిష్ట, మహాఅభిషేకాలు, దేవీ చండీ సప్తశతీ పారాయణాలు నిర్వహించారు. అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరాలయంలోనూ అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రతిష్టించి దేవీభాగవత ప్రవచనాలు, కన్యాక-సువాసినీ పూజలు, పల్లకీ సేవలను ఘనంగా జరిపారు. భీమేశ్వరాలయంలో అక్టోబర్ 11 నుండి 20 వరకు రూ. 5,000 రుసుముతో ప్రత్యేక కుంకుమ పూజల సేవలు అందుబాటులో ఉంటాయని, భక్తులు విశేషంగా పాల్గొని స్వామి, అమ్మవార్ల కృప పొందాలని ఆలయ పి.ఆర్.ఓ పెరిక శ్రీనివాస్ కోరారు.

## పోరండ్ల పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా కృష్ణగౌడ్ బాధ్యతలు

**తిమ్మాపూర్, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**

పోరండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (గ్రాజూ) వైస్ చైర్మన్‌గా రావుల కృష్ణగౌడ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆశీస్సులతో ఆయన ఈ పదవిని చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించి, సొసైటీ చైర్మన్ గోపు తిరుపతిరెడ్డితో పాటు కృష్ణగౌడ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, నోడల్ అధికారి అక్బరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## కన్నులపండువగా దుర్గామాత ఆగమన వేడుకలు

**వేములవాడ, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
వేములవాడ పట్టణ పరిధిలోని తిప్పాపూర్ ప్రాంతంలో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన దుర్గామాత ఆగమన వేడుకలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ కన్నులపండువగా జరిగాయి. ఈ వేడుకలకు వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆధ్యాత్మిక భావనతో నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, దుర్గాదేవి ఆశీస్సులతో వేములవాడ ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్, స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రజక సంఘం అధ్యక్షునిగా రాచకొండ శ్రీనివాస్

**ఇల్లంతకుంట అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక రజక సంఘం అధ్యక్షునిగా రాచకొండ శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆదివారం రోజు సమావేశమై గ్రామ రజక సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా అనంతగిరి లక్ష్మిరాజం, తడ్కపెల్లి పోచయ్య, కోశాధికారిగా రాచకొండ రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ రజకుల ఐక్యతకు పాటుపడతానని, సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ ప్రతి ఒక్కరికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజకులు పాల్గొన్నారు.

## నేడు కొత్త ఐడీఓసీలో ప్రజావాణి

**కరీంనగర్:,అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి )**
జిల్లా ప్రజల సమస్యలు, విజ్ఞప్తుల స్వీకరణ కోసం సోమవారం కరీంనగర్‌లోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) భవనంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఐడీఓసీ భవనంలోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

# రైతులకు రుణాల మంజూరులో ఇబ్బందులు పెట్టొద్దు

## ఎమ్మెల్యే కవ్వంపల్లి సూచన

**తిమ్మాపూర్,అక్టోబర్ 11( ప్రజాజ్యోతి )**
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా గోపు తిరుపతిరెడ్డితో పాటు పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణాలు మంజూరు చేసే విషయంలో ఎలాంటి ఇబ్బందులు కల్పించవద్దని, అవసరమైతే నిబంధనలను సరళతరం చేయాలని అన్నారు. మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని మానకొండూరు ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు, సహకార సంఘాల అభివృద్ధికి పాత బకాయిలు ప్రతిబంధకంగా మారకుండాచూడాలన్నారు. బకాయిల వసూళ్ల విషయంలో ఉదాసీన వైఖరిని వీడి, అవసరమైతే ప్రత్యేక డ్రైవ్



నిర్వహించాలనిసూచించారు. అదే సమయంలో రైతులకు రుణాల మంజూరులో అనవసర జాప్యం లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి అక్బరుద్దీన్, స్థానిక సర్పంచ్ అసోద శ్రీనివాస్, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, పీఏసీఎస్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, ఒగ్గు దామోదర్, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, చింతల తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాసరావు, రాజేందర్‌రెడ్డి, ద్యావ శ్రీనివాస్‌రెడ్డి, పులి కృష్ణ,శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కృష్ణగౌడ్, వెంకన్న, పొన్నాలసంపత్, కేతిరెడ్డి లింగారెడ్డి, మేడి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితులు, యాసంగి పంట ప్రణాళికపై రైతులకు అవగాహన సదస్సు

**ఎలిగేడు, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, పంటల రక్షణ, యాసంగి ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ధూళికట్ట రైతు వేదికలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు



మండల వ్యవసాయ అధికారి ఉమాపతి తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ప్రసార ప్రసంగాన్ని రైతులకు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. వాతావరణ మార్పులను తట్టుకోవడం, నీటి యాజమాన్యం, యాసంగిలో సాగు చేయాల్సిన పంటలపై సీఎం అందించే మార్గదర్శకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తప్పక హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్‌ది దుష్ప్రచారం

- నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లు తొలగించకూడదా?
- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర

**కరీంనగర్ టౌన్ అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి ) :**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర విమర్శించారు. రాజకీయ లబ్ధి పొందాలనే లక్ష్యంతోనే ఎస్ఐఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. బీజేపీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన



సమావేశంలో కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో పారదర్శకతను పెంపొందించడం, నకిలీ ఓట్లను తొలగించడం, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ ప్రక్రియను రాజకీయ కోణంలో చూడటం సరికాదని అన్నారు. నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించకూడదా? అని కాంగ్రెస్ నేతలను ఆయన ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణ కొత్త విషయమేమీ కాదని, ఎన్నికల సంఘం గతంలోనూ వివిధ సందర్భాల్లో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేశారు. ఓటర్లలో అనవసర భయాందోళనలు సృష్టించి రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నిస్తున్నాయని కళ్యాణ్ చంద్ర ఆరోపించారు. ప్రజాస్వామ్యం మరింత బలోపేతం కావాలంటే స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా అవసరమని స్పష్టం చేశారు. బీజేపీపై ఓట్ల చోరీ ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ గత పాలనలో జరిగిన ఎన్నికలపై కూడా స్పష్టత ఇవ్వాలని ఆయన వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను ప్రజలు గమనించాలని కోరారు. ఢిల్లీ కేంద్రంగా ఆందోళనలు చేస్తున్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు ఎస్ఐఆర్‌పై తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వర చారి, ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, ఓదెలు, బుర్ర శ్రీనివాస్ గౌడ్, మధుకర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గర్రెపల్లి మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**అధ్యక్షుడిగా జెట్టి సంపత్.. కార్యదర్శిగా జెట్టి అనిల్**



**సుల్తానాబాద్, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి) :**
మండలంలోని గర్రెపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా జెట్టి సంపత్, ఉపాధ్యక్షుడిగా కీర్తి మల్లయ్య, కార్యదర్శిగా జెట్టి అనిల్ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా జెట్టి రమేష్, కుందెళ్ల శ్రీనివాస్, గీకురు శంకరయ్య, పసల్ల మురళి, కుందెళ్ల సతీష్, పిట్టల వెంకటయ్య ఎన్నికై నూతన పాలకవర్గంలో స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులను బీజేపీ సీనియర్ నాయకుడు జెట్టి శ్రీనివాస్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యులకు అభినందనలు తెలియజేశారు. నూతన పాలకవర్గం మత్స్యకారుల సంక్షేమానికి, సంఘం అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సంఘంలోని సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ, ఐకమత్యంతో ముందుకు సాగి మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. నూతన కార్యవర్గం సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని జెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు.

# ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

**సి పి ఐ ఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**




**కరీంనగర్, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి )**
శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చిన సీపీఎం అగ్రనాయకులను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణికి నిదర్శనమని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి విమర్శించారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులకు నిరసనగా ఆదివారం కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని, పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ సీఈసీని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సంపత్, డి. నరేష్ పటేల్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# నరసన్న పటేల్‌కు ఆత్మీయ అభినందనలు



**కొత్తపల్లి, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్‌ను 11వ డివిజన్ న్యూ శ్రీనగర్ కాలనీ ప్రజలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి, బతుకమ్మ సంబరాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. కాలనీలో రోడ్ల నిర్మాణం, పార్కు అభివృద్ధికి కృషి చేసినందుకు ఈ సందర్భంగా ఆయనకు కాలనీవాసులు ఆత్మీయ అభినందనలు తెలిపారు. కాలనీని మరింత అభివృద్ధి బాటలో నడిపించి, భవిష్యత్తులో నరసన్న పటేల్ ఉన్నత పదవులు పొందాలని కాలనీ ప్రెసిడెంట్, ప్యాక్స్ చైర్మన్ కటంగూరి శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. కాలనీలో మరిన్ని సంక్షేమ పనులు చేపడతానని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, నవీన్ కుమార్, అలిముద్దీన్, ఆడిటర్ శ్రీనివాస్, మోహన్ రెడ్డి, రవి కిరణ్, శ్రీనివాస్ రెడ్డి, జాజిరెడ్డి, సారంగపాణి, చంద్రమౌళి, శ్యామ్, శివకుమార్, కనకయ్య, వెంకటరమణ, బుచ్చన్న, రెడ్డి నాయక్, వెంకన్న,అంజయ్య, శ్రీధర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్, వెంకటస్వామి హేమశీత్ , అనిల్,శరత్ కాలనీవాసులు మరియు పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరసన హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం

**ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి**




**కరీంనగర్ ,అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి )**
ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద వామపక్ష నేతలు చేపట్టనున్న నిరసనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడాన్ని ఏఐఎఫ్‌బీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి ఖండించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ప్రజా సమస్యలపై గళమెత్తే వారిని అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు.ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు అన్ని ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



## ఆపదలో ఉన్న గౌడ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

**కోనరావుపేట, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు లింగపురం వెంకటస్వామి గౌడ్ మృతి చెందడంతో, వారి కుటుంబానికి తెలంగాణ గౌడ యువజన సంఘం (టీజీవైఎస్) జిల్లా కమిటీ అండగా నిలిచింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ తరఫున బాధిత కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్బాసాని సందీప్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని, ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి శ్రీకాంత్ గౌడ్, జవ్వాజి అరవింద్ గౌడ్, మండల అధ్యక్షుడు గొల్లపల్లి సాయికుమార్ గౌడ్, స్థానిక యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా దసరా, బతుకమ్మ వేడుకలు

**వేములవాడ, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారి ఆలయంలో దసరా, బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ పవిత్ర వేడుకల సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో రుద్రాభిషేకాలు, చండీ హోమం, ప్రత్యేక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, తాగునీరు, ప్రసాద వితరణ తదితర సౌకర్యాలను ఆలయ అధికారులు కల్పించారు.



# భీమేశ్వరాలయంలో నవరాత్రి అలంకరణలు

**వేములవాడ, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ అధికారులు మందిరాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, శోభాయమానమైన పూలదండలు, మామిడి తోరణాలతో ఎంతో మనోహరంగా అలంకరించారు. ఆధ్యాత్మిక శోభతో విలసిల్లుతున్న ఆలయ దృశ్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తుల రద్దీ నిరంతరం పెరుగుతోంది.

# మహాశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు



**కరీంనగర్, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
నగరంలోని శ్రీ మహాశక్తి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమివ్వగా, ఉదయం ధ్వజారోహణ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రుల వేళ భక్తులకు మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందించడంతో పాటు ప్రతిరోజూ బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మతో భాగవత ప్రవచనాలు, రాత్రి దాండియా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

# పత్తిపాకలో శరన్నవరాత్రోత్సవాలు



**ధర్మారం, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాకలో శ్రీ విజయ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శివాజీ విగ్రహం వద్ద నుండి మండపం వరకు ఒగ్గు కళాకారులు, డప్పు చప్పుళ్లు, మహిళల కోలాటాల నడుమ అమ్మవారి ఊరేగింపు కన్నులపండువగా సాగింది. అనంతరం మండపంలో గణపతి హోమం, కలశ స్థాపన, అఖండ దీపారాధన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# నైపుణ్యంతోనే భవిష్యత్తుకు పునాది

- యువత అభివృద్ధికి సింగరేణి తగిన తోడ్పాటు
- హైదరాబాద్ బయలుదేరిన 55 మంది మహిళలు
- సింగరేణి ఆర్జీవన్ జీఎం లలిత కుమార్



**గోదావరిఖని, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):**
సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువతకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాన్ని అందించేందుకు సంస్థ కృషి చేస్తోందని జీఎం డి.లలిత్ కుమార్ అన్నారు. శిక్షణను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానించడం ద్వారా యువత మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునే అవకాశం లభిస్తోందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో పనిచేస్తూ వృత్తిలో ఎదగాలని సూచించారు. ఫాక్స్కాన్ కంపెనీ ఆధ్వర్యంలో గత వారం జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో మహిళా అభ్యర్థులకు ప్రత్యేక ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హైదరాబాద్ లోని కంపెనీ తయారీ కేంద్రంలో ఆపిల్ ఇయర్పాడ్స్, ఎలక్ట్రానిక్ విడిభాగాల అసెంబ్లింగ్ విభాగాల్లో పనిచేసేందుకు 87 మంది మహిళలను ఎంపిక చేశారు. సోలార్ టెక్నిషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆర్జీ--1 జీఎం డి. లలిత్ కుమార్ తెలిపారు. వీరు పది రోజుల్లో ఎల్ అండ్ ఎన్ కంపెనీలో ఉద్యోగాల్లో చేరనున్నట్లు పేర్కొన్నారు. ఆర్జీవన్ ఏరియాలోని సింగరేణి జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా 154 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 127 మంది మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. వీరిలో 87 మంది హైదరాబాద్ ఫాక్స్కాన్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 27 మంది పురుష అభ్యర్థులు సోలార్ టెక్నిషియన్ ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. వీరిలో 25మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆర్జీ--1 జీఎం శ్రీ డి. లలిత్ కుమార్ తెలిపారు. వీరు పది రోజుల్లో ఎల్ అండ్ ఎన్ కంపెనీలో ఉద్యోగాల్లో చేరనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం ఎస్.కె. చంద్రశేఖర్,ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మద్దీ ఎల్లయ్య,టాస్క్ మేనేజర్ డాక్టర్ కౌసల్య,ఎల్ అండ్ ఎన్ డైరెక్టర్ కౌశల్, ఫాక్స్కాన్ హెచ్ఆర్ ప్రతినిధి ఆర్. శ్రీనివాస్, జీవీటీసీ మేనేజర్ మాధవరెడ్డి,సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

# కొండపాకలో పోలీసుల కార్డన్ సెర్చ్

- సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు
- ఇసుక ట్రాక్టర్ పై కేసు నమోదు

**వీణవంక, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):**
కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు హుజురాబాద్ ఏసీపీ మాధవి ఆధ్వర్యంలో వీణవంక మండలంలోని వీణవంక, కొండపాక గ్రామాల్లో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని వీణవంకలో 22 బైక్‌లు, 13 ట్రాలీ ఆటోలకు, కొండపాకలో 40 బైక్‌లు, రెండు ట్రాక్టర్లకు జరిమానాలు విధించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మరో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాధవి మాట్లాడుతూ ప్రజలు దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. పోక్సో చట్టంపై పిల్లలు, తల్లిదండ్రులకు అవగాహన ఉండాలని, అనుమానాస్పద ఘటనలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆపరేషన్‌లో హుజురాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్, టౌన్ సీఐ కరుణాకర్, జమ్మికుంట సీఐ రామకృష్ణ, నలుగురు ఎస్ఐలు, 60 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# 105 మంది చిన్నారులకు ఉచిత వైద్యం

- శ్రీకృష్ణ పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో శిబిరం
- చిన్నారులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు

**ఇల్లందకుంట, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):**
శ్రీరాములపల్లి గ్రామంలో మంచిర్యాల పట్టణానికి చెందిన శ్రీకృష్ణ పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సింగం వేణుమాధవ్ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడమే ధ్యేయమని నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో మొత్తం 105 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చిన్నారులకు పోషకాహారం అందించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు వైద్య సేవలు అందుబాటులోకి



తీసుకురావడానికి ఇవి ఉపయోగపడతాయని గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది నవీన్, మహేశ్, రమేశ్, గ్రామ సర్పంచ్ గుత్తికొండ రమ్య, రవికుమార్, కార్యదర్శి కారోబారు వీరన్న పాల్గొన్నారు.

# మోకాళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయొద్దు..,

- ఆధునిక రోబోటిక్ చికిత్సతో మెరుగైన జీవన ప్రమాణాలు,
- కిమ్స్ ఆసుపత్రి ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు
- డాక్టర్ సాయి ఫణి చంద్ర




కరీంనగర్ టౌన్ అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి ) మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి చెందిన ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు డాక్టర్ సాయి ఫణి చంద్ర సూచించారు. ఆధునిక చికిత్సా విధానాలతో కీళ్ల సమస్యలను నియంత్రించి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. ప్రపంచ కీళ్లవాతం దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని శ్వేతా సాయి ఫణి క్లినిక్‌లో కీళ్ల ఆరోగ్యం, మోకాళ్ల నొప్పులు, ఆధునిక చికిత్సా విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వయస్సు పెరగడం, కీళ్ల అరుగుదల వంటి కారణాలతో నడవడం, మెట్లు ఎక్కడం, రోజువారీ పనులు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదు-రవుతాయని వివరించారు.కీళ్ల నొప్పులు ఉన్న ప్రతి ఒక్కరికీ శస్త్రచికిత్స అవసరం లేదని, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి మందులు, వ్యాయామం, భౌతిక చికిత్స లేదా అవసరమైన సందర్భాల్లో శస్త్రచికిత్సను సూచిస్తారని తెలిపారు. కీళ్ల అరుగుదల తీవ్రంగా ఉన్నవారికి రోబోటిక్ సహాయక కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స ఆధునిక చికిత్సా ఎంపికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. డాక్టర్ సాయి ఫణి చంద్రకు 150కి పైగా రోబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహించిన అనుభవం ఉందని నిర్వాహకులు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యుల సూచనలు పాటించడం, అవసరమైన భౌతిక చికిత్స చేయించుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయకుండా నిపుణుల సలహాతో తగిన చికిత్స పొందాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశం లో శ్వేతా సాయి ఫణి క్లినిక్ నిర్వాహకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఓట్లను తొలగించవద్దా: కళ్యాణ్ చంద్ర

- కాంగ్రెస్ తీరుపై బీజేపీ విమర్శలు
- ఎస్ఐఆర్ ప్రక్రియపై గందరగోళం తగదు

తిమ్మాపూర్, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర విమర్శించారు. తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్, సిపిఐ పార్టీలు ఎన్నికల సంఘం, ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. నకిలీ ఓట్లు, మరణించిన వారి ఓట్లను తొలగించి అర్హులైన పౌరులకు ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను తయారు చేస్తుంటే ఓటు బ్యాంకు రాజకీయం చేయడం సరికాదన్నారు. రాహుల్ గాంధీ



ప్రజలను గందరగోళానికి గురిచేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు జగదీశ్వర చారి, తిరుపతి రెడ్డి, ఓదెలు, శ్రీనివాస్ గౌడ్, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కల్వచర్లలో బతుకమ్మ సంబరాలకు మాజీ సర్పంచ్ మంజూర్ ఏర్పాట్లు



రామగిరి, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి) : పదవిలో ఉన్నా.. లేకున్నా ప్రజలతోనే తన ప్రయాణమని చాటుకుంటున్నారు లొంకకేసారం మాజీ సర్పంచ్ ఎం.డి. మంజూర్. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కల్వచర్ల గ్రామంలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. మహిళలు సంతోషంగా వేడుకల్లో పాల్గొంటూ సంప్రదాయాలను కొనసాగించాలనే ఉద్దేశంతో పండుగ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంచే వేడుకలని, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొంటూ గ్రామ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.



## ఈ నెల 26న ఛలో హైదరాబాద్: సీఐటీయూ

గోదావరిఖని, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి): ఈ నెల 26న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిఖని శ్రామిక భవన్‌లో జరిగిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు నిధులను పక్కదారి పట్టిస్తోందని, నిలిచిపోయిన 13 లక్షల మంది కార్మికుల పేర్లను వెంటనే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులందరికీ పెన్షన్ అందించాలని కోరిన ఈ సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## సాగునీరందించి పంటలను కాపాడాలి

అత్తే చంద్రమౌళి



ముత్తారం, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి): సాగునీరు లేక, విద్యుత్ కోతల వల్ల మండలంలో పంట పొలాలు ఎండిపోతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సాగునీరు అందించాలని మాజీ ఎంపీపీ, లక్కారం సర్పంచ్ అత్తే చంద్రమౌళి డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుండి గుండారం రిజర్వాయర్ నింపి, లిఫ్ట్ ద్వారా శుక్రవారంపేట్ రిజర్వాయర్‌కు నీటిని మళ్లించి కెనాల్ ద్వారా పొలాలకు నీరందించాలని కోరారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే రైతులు గగ్గోలు పెడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



## ముస్తాబాద్‌లో ఘనంగా అటుకుల బతుకమ్మ వేడుకలు

ముస్తాబాద్, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి): స్థానిక బ్రహ్మసూత్ర శివాలయం ముందు రెండవ రోజు అటుకుల బతుకమ్మ వేడుకలను మహిళలు, చిన్నారులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఉత్సాహంగా ఆడిపాడడంతో శివాలయం పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. చిన్నాపెద్దా అందరూ కలిసిమెలిసి పాల్గొన్న ఈ వేడుకలు తెలంగాణ సంప్రదాయాల పరిరక్షణకు నిదర్శనంగా నిలిచాయి.



## ఆసుపత్రిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజేందర్ పరామర్శ

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూది రాజేందర్ గుండెపోటు గురికావడంతో స్థానిక అశ్విని ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి ఆసుపత్రికి వెల్లి ఆయనను పరామర్శించారు. రాజేందర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వంగా గిరిధర్ రెడ్డి, పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ బాధితురాలికి రూ.10 వేల ఆర్థిక సాయం

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
సింగారం గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధిత మహిళ దూదేకుల భాను బీ కుటుంబానికి 'సింగారం హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ' రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేసింది. భాను బీ భర్త హుస్సేన్ అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆమెకు క్యాన్సర్ నిర్ధారణ కావడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదు సాయం అందించడమే కాకుండా, దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక సాయం చేయాలనుకునేవారు 9550943700 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## మడిపల్లిలో ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ

**జమ్మికుంట, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలోని శివాలయం సమీపంలో దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. అమెరికా ఎన్ఆర్ఐ నేరెళ్ల దామోదర్ గౌడ్ అందించిన దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి మండపంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభంతో పాటు భక్తులు దుర్గామాత మాలధారణను స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకమల్ల తిరుమల వెంకటేష్, కమిటీ సభ్యులు కస్తూరి ప్రవీణ్ కుమార్, నాగపురి శ్రీనివాస్, దేవుని లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ సరఫరా కోరతూ రైతుల నిరసన

- ట్రాన్స్‌ఫార్మర్ తీగలపై బట్టలు ఆరేసి ఆందోళన
- పంటలు ఎండిపోతున్నాయని మచ్చుపేట రైతుల ఆవేదన



**ముత్తారం, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):**
పంటలకు సరిపడా విద్యుత్ సరఫరా చేయడం లేదంటూ ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామ రైతులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలపై బట్టలు ఆరేసి తమ ఆవేదనను వ్యక్తపరిచారు. పంటలు పొట్ట దశలో ఉన్న కీలక తరుణంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోయారు. ప్రస్తుతం రోజుకు ఐదు గంటలు కూడా నాణ్యమైన కరెంటు అందడం లేదని, ఎల్సీల పేరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. పంటలకు నీరు అందక పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

# సింగరేణి కార్మిక గర్జన సభను విజయవంతం చేయాలి..

- ఈ నెల14న రామగుండంలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ..
- పార్టీ శ్రేణులు,నాయకులు భారీగా తరలి రావాలని పిలుపు..



**ముత్తారం, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి)**
ఈ నెల 14న రామగుండం ప్రాంతంలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ముత్తారం మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్ పిలుపునిచ్చారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వారు తెలిపారు. సింగరేణి కార్మికుల సమస్యలు, హక్కులపై గళమెత్తేందుకు నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు కార్మికులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సింగరేణి ప్రాంత అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఇలాంటి సభలు ప్రాధాన్యత కలిగి ఉంటాయని నాయకులు పేర్కొన్నారు. సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# 13న పెద్దపల్లి జిల్లా దశాబ్ది వేడుకలు

**పెద్దపల్లి, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటుకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈ నెల 13న పెద్దపల్లిలో దశాబ్ది వేడుకలు నిర్వహించనున్నట్లు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగి పాలన ప్రజలకు చేరువైందని పేర్కొన్నారు. జిల్లా సాధన కోసం పోరాడిన వారిని స్మరించుకుంటూ నిర్వహించే ఈ వేడుకల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, వంగల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కరెంటు కోతలు ఆపండి.. పంటలను కాపాడండి

- రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించండి
- ఎకరాకు రూ.30 వేల పరిహారం ముందుగానే రైతుల ఖాతాల్లో జమ చేయాలి
- ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా వ్యవసాయ ఎమర్జెన్సీ ప్రకటించాలి
- కరెంటు కోతలకు నిరసనగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా
- మాజీ మంత్రి,కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్




**కరీంనగర్ రూరల్, అక్టోబర్ 11, (ప్రజాజ్యోతి):**
కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడం లేదని, తరచూ విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. 'కరెంటు కోతలను ఆపండి.. పంటలను కాపాడండి' అంటూ కరీంనగర్ నియోజకవర్గంలోని రూరల్ మండల రైతుల ఆధ్వర్యంలో గోపాల్‌పూర్,దుర్షెడ్ స్టేజీ వద్ద ఆదివారం నిర్వహించిన నిరసన రాస్తారోకోలో ఆయన పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతులు విద్యుత్,సాగునీటి రంగాల్లో వచ్చిన మార్పులను చూశారని అన్నారు.కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతల కారణంగా వ్యవసాయ రంగం ఇబ్బందుల్లో పడిందని విమర్శించారు. గంటకోసారి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో మోటార్లు కాలిపోతున్నాయని, వ్యవసాయంతోపాటు గృహావసరాలకు కూడా నాణ్యమైన విద్యుత్ అందడం లేదని ఆరోపించారు.

**కేసీఆర్ పాలనలో 24 గంటల విద్యుత్...**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేసే విధానాన్ని అమలు చేశామని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. కరెంటుతోపాటు సాగునీరు అందుబాటులో ఉంటేనే రైతులు పంటలు పండించగలరనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చిందని తెలిపారు. చెరువులు,కుంటలు,జలాశయాల్లో నీటి లభ్యత పెంచేందుకు చర్యలు చేపట్టిందన్నారు.రైతులకు విద్యుత్,సాగునీటి భరోసా కల్పించిన గత ప్రభుత్వ విధానాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని కోరారు.

**ఎకరానికి రూ.30 వేల పరిహారం ఇవ్వాలి..**

విద్యుత్ సరఫరా సమస్యలతోపాటు ప్రకృతి వైపరీత్యాలు,వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని గంగుల కమలాకర్ అన్నారు.ప్రభుత్వం పంటలకు నీటి కొరత ఏర్పడే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి,అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పంటలకు నష్టం కలిగించే పరిస్థితుల్లో రైతులు అప్పులపాలుకాకుండా ఉండేందుకు రాష్ట్రంలో ఎమర్జెన్సీ ప్రకటించి ఎకరానికి రూ.30 వేల చొప్పున పరిహారాన్ని ముందుగానే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు.అలాగే పశువుల మేత,పశుగ్రాసం కోసం రైతులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎమర్జెన్సీ ప్రకటించి,రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు.విద్యుత్ కోతలు,వ్యవసాయ సంక్షోభం ప్రభావం ఇతర రంగాలపైనా పడుతోందని,రియల్ ఎస్టేట్ వ్యాపారం సైతం దెబ్బతిన్నదని వ్యాఖ్యానించారు.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి...**

రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని,వ్యవసాయ మోటార్లు కాలిపోకుండా విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలని గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించి,పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సర్దార్ రవీందర్ సింగ్,చల్ల హరి శంకర్,పొన్నం అనిల్ కుమార్,శ్యాంసుందర్ రెడ్డి,సుంకిశాల సంపత్ రావు,రైతులు,ఆయా గ్రామాల ప్రజలు పాల్గొని వ్యవసాయ విద్యుత్ సమస్యలపై తమ ఆందోళన వ్యక్తం చేశారు.

# ఈసీకి ఎంపీ బహిరంగ క్షమాపణ చెప్పాలి: పల్లె సదానందం

**పెద్దపల్లి, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
కేంద్ర ఎన్నికల సంఘంపై విమర్శలు చేసిన పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన ఈసీపై నిరాధార ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యాన్ని కించపరచడమేనని విమర్శించారు. ఎంపీగా గెలిచి 16 నెలలైనా నియోజకవర్గ అభివృద్ధికి తెచ్చిన నిధులపై వంశీకృష్ణ స్పష్టత ఇవ్వాలని, కేంద్ర నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమని



సవాల్ విసిరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మోర మనోహర్, పెంద్యాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రాజన్న ఆలయం వద్ద భక్తులకు అన్నదానం

**వేములవాడ, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):**
వేములవాడ రాజన్న ఆలయం వద్ద ఆదివారం 150 మంది భక్తులకు అన్నదానం, స్వీట్, మిర్చి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారి సాన్వి, సిరిసిల్ల కౌన్సిలర్ కుమారుడు అఖిల్ పటేల్ పుట్టినరోజుల సందర్భంగా బొడ్డు ప్రేమ్ కుమార్, గోపు వెంకటేష్, బాలుసాని తిరుపతి గౌడ్ తదితర దాతలు ఈ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. వేడుకల సందర్భంగా పేదలకు అన్నదానం చేయాలనుకునే దాతలు తమ ట్రస్ట్ సంఖ్య 9246939388ను సంప్రదించాలని ట్రస్ట్ నిర్వాహకులు మధు, మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నాగుల చంద్రశేఖర్, ప్రతాప నటరాజు, నక్క వేణు తదితరులు పాల్గొన్నారు.



## యువ కవి అంకారపు రవికి చిరు సత్కారం

**సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 11 ప్రజాజ్యోతి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకలను పురస్కరించుకుని సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం వైభవంగా నిర్వహించిన సాహిత్య సమరం కార్యక్రమంలో యువ కవి రచయిత అంకారపు రవికి చిరు సత్కారం లభించింది. సాహిత్య రంగానికి అందిస్తున్న సేవలను గుర్తించి పలువురు నాయకులు రవిని శాలువాతో ఘనంగా గౌరవించారు. ఈ సందర్భంగా అంకారపు రవి మాట్లాడుతూ జిల్లా దశాబ్ది వేడుకల వేదికగా తనను గౌరవించడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ గౌరవాన్ని అందించిన నాయకులకు, నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వేడుకలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, నాయకులు గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళా చక్రపాణి, గజబింకర్ రాజన్న, పడిగెల రాజు, ఎండీ సత్తార్ తదితరులు పాల్గొని అంకారపు రవిని అభినందించారు.

## అంజికి మున్సిపల్ చైర్మన్ పరామర్శ



**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 11 ప్రజా జ్యోతి:**
పెద్దపల్లి పట్టణానికి చెందిన కౌన్సిలర్ దేవనంది రమాదేవి భర్త దేవనంది అంజి అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లన్న ఆదివారం ఆసుపత్రికి వెళ్లి అంజిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ పరామర్శలో కౌన్సిలర్లు శ్రీకాంత్, గుట్టుతో పాటు పలువురు పాల్గొన్నారు.



## మాహాత్మనగర్ లో ముదిరాజ్ సంఘం ఏకగ్రీవ ఎన్నిక

**తిమ్మాపూర్ అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మాహాత్మనగర్ గ్రామశీ లో ముదిరాజ్ సంఘం చీఫ్ అడ్వైజర్ పోలు రవి కుమార్ అధ్యర్యంలో ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షులుగా జక్కుల అనిల్, ఉపాధ్యక్షులు గా దయ్యాల విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా యమ తిరుపతి, సహాయ కార్యదర్శి గా సిల్ల నరేష్, కోశాధికారి గా బోయిని వెంకటేష్ ఎంచుకోవడం జరిగింది. డైరెక్టర్స్ గా జంగాపల్లీ నర్సయ్యా, కూన రాజయ్య, బొమ్మరవేణి రామచంద్రం, యమ తిరుపతి, సాన సాయి, బోయిని రమేష్, రెడ్డవేణి నరేందర్, కీసరి అరవింద్ రెడ్డే, డి. నరేందర్ నియమించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సార్ ప్రక్రియపై రాజకీయం తగదు: బీజేపి



**చొప్పదండి, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):** దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా కొనసాగుతున్న ఓటర్ల సార్ ప్రక్రియపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదని బీజేపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ విమర్శించారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా సవరణ చేపడుతోందని, ఎక్కడా అక్రమంగా ఓట్లను తొలగించలేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు రాజ్యాంగ సంస్థలపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు సార్ ప్రక్రియను తప్పుబడుతున్నాయని ఆరోపించారు.



## ధర్మారంలో బాల త్రిపుర సుందరిగా అమ్మవారి దర్శనం

**కోనరావుపేట, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):** కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో శ్రీ అమ్మ భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పుష్పమాలలు, ఆభరణాలతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# గోదాముల పురుగులతో కాలనీవాసుల తీవ్ర అవస్థలు

- మారుతి నగర్ ఇంద్రనగర్ ఇళ్లలోకి పురుగులు
- అధికారులు పట్టించుకోవాలని కాలనీవాసుల విజ్ఞప్తి





**జమ్మికుంట, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):** జమ్మికుంట పట్టణంలోని 8వ వార్డు మారుతి నగర్, ఇంద్రనగర్ సమీపంలో ఉన్న గోదాముల నుంచి వస్తున్న పురుగులతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోదాముల నుంచి వస్తున్న పురుగులు ఇళ్లలోకి చేరడంతో పాటు బట్టలపై కూడా వస్తుండటంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలో నివసించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఈ సమస్యపై గోదాముల యజమానులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. రోజురోజుకూ పురుగుల బెడద పెరుగుతున్నా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునే వారు కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, సంబంధిత శాఖల అధికారులు స్పందించి గోదాములను పరిశీలించాలని, పురుగుల బెడద నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# 14న గోదావరిఖనిలో సింగరేణి కార్మిక గర్జన

**రామగిరి, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి) :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 14న గోదావరిఖనిలోని జీఎం ఆఫీస్ గ్రౌండ్‌లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక గర్జన నిర్వహించనున్నట్లు ఆ సంఘం ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ నాగలి సాంబయ్య పత్రికా ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. 2025--26 సింగరేణి లాభాల్లో కార్మికుల వాటాపై స్పష్టత, ప్రతినెలా మెడికల్ బోర్డు నిర్వహణ, ప్రభుత్వ బకాయిల చెల్లింపు, 250 గజాల ఇంటి స్థలాల కేటాయింపు, పెండింగ్‌లో ఉన్న 300 డిపెండెంట్ ఉద్యోగాల భర్తీ తదితర డిమాండ్ల సాధన కోసం ఈ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్మికులు, యువత, సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్మిక గర్జనను విజయవంతం చేయాలని నాగలి సాంబయ్య కోరారు.



# సాగు కష్టాలకు తోడు మోటార్ల చోరీలు..

- బవర్షాభావం, విద్యుత్ కోతలకు తోడు మోటార్లు, స్టార్టర్ల అపహరణ
- ఒక్కో రైతుకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు నష్టం
- రాత్రివేళల్లో గస్తీ పెంచాలని మల్లాపూర్ రైతుల విజ్ఞప్తి

**మల్లాపూర్, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):** ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తున్న రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు వర్షాభావ పరిస్థితులతో సాగునీటి కొరత ఏర్పడగా, మరోవైపు విద్యుత్ కోతలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వీటికి తోడు వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, స్టార్టర్లు చోరీకి గురవుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కష్టపడి పెంచుకున్న పంటలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్న రైతులకు ఈ చోరీలు కోలుకోలేని దెబ్బగా మారాయి. సాగునీటికి కష్టాలు.. పెరిగిన మోటార్ల వాడకం వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు అడుగంటిపోయాయి. దీంతో మెజారిటీ రైతులు బావులపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. అయితే విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు కలగడం, కరెంట్ ఉన్న సమయంలో మోటార్లు సరిగ్గా పనిచేయకపోవడంతో పంటలకు నీరందించడం గగనంగా మారింది.



### వరస దొంగతనాలతో రూ.వేలల్లో నష్టం

మల్లాపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ పొలాల్లో మోటార్ల దొంగతనాలు వరుసగా జరుగుతుండటంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. తాజాగా ఇట్టెడి మోహన్‌రెడ్డికి చెందిన వ్యవసాయ బావి వద్ద సుమారు రూ. 15 వేల విలువైన మోటారును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్న ఆయన పంటకు నీరందించాల్సిన కీలక సమయంలో మోటారు దొంగతనం జరగడంతో దిక్కుతోచని స్థితిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఐదు ఎకరాల్లో వరి సాగు చేస్తున్న ఏలాల శంకర్‌రెడ్డికి చెందిన రూ. 25 వేల విలువైన మోటారు చోరీకి గురికావడంతో ఆయన తీవ్ర ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోంది.

### చోరీలను అరికట్టాలని రైతుల విజ్ఞప్తి

ఇప్పటికే సాగు పెట్టుబడులు, విద్యుత్ సమస్యలతో చిన్నసన్నకారు రైతులు సింగారపు అశోక్, కళ్లెం మహిపాల్‌రెడ్డి తదితరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో మోటార్లు, స్టార్టర్లు చోరీకి గురైతే నూతన మోటార్లు కొనుగోలు చేసే స్తోమత తమకు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి వ్యవసాయ బావుల వద్ద రాత్రివేళల్లో నిఘా పెంచాలని, చోరీలకు పాల్పడుతున్న ముఠాను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మల్లాపూర్ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా దశాబ్ది వేడుకలు

- కేసీఆర్ కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం
- కోనరావుపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు



**కోనరావుపేట, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడి పదేళ్ల పూర్తయిన సందర్భంగా కోనరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకలను నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మల్యాల దేవయ్య మాట్లాడుతూ కేసీఆర్ 14 ఏళ్ల పాటు పోరాటం చేసి ప్రత్యేక తెలంగాణ సాధించారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లాల పునర్వ్యవస్థీకరణతో పరిపాలన ప్రజలకు చేరువైందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు మందగించాయని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమ కార్యక్రమాలను గ్రామీణ స్థాయిలో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు గుండా వెంకటేష్, బొజ్జ మల్లేశం, మల్యాల స్వామి దాస్, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

# బొక్కలవాగులో బ్రిడ్జి నిర్మాణం కోసం సాయిల్ టెస్ట్

- గంగాపూర్ బోయినిపేట మధ్య ప్రారంభమైన పనులు
- మంత్రి శ్రీధర్ బాబుకు ప్రజల కృతజ్ఞతలు



**మంథని, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):** మంథని మున్సిపాలిటీ పరిధిలోని బోయినిపేట-గంగాపురి మధ్య బొక్కలవాగులో బ్రిడ్జి నిర్మాణం కోసం సాయిల్ టెస్ట్ (మట్టి పరీక్ష) పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో గంగాపురి, బోయినిపేట, గొల్లగూడెం గ్రామాల ప్రజలకు ప్రయాణ దూర భారం తగ్గనుంది. కరీంనగర్-కాటారం, ఓడెడ్ ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఈ బ్రిడ్జ్ నిర్మించనుండటంతో రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినందుకు మంత్రి శ్రీధర్ బాబుకు శ్రీ గౌతమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గుండా రాజు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# కోనేరుపల్లి, సాంబయ్యపల్లె గ్రామాల్లో కార్డుల పంపిణీ



**చొప్పదండి, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):** చొప్పదండి మండలం కోనేరుపల్లె, సాంబయ్యపల్లె గ్రామాలలో రెవెన్యూ అధికారులు ఆదివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారి కలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజా ప్రభుత్వం పాలనలో మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు దూసుకెళ్తుందని, త్వరలోనే మోతె కాలువల నిర్మాణం పూర్తి చేసి చెరువులను నింపి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు వేణుగోపాల్ రాజు, మాచర్ల రమాదేవి, చొప్పదండి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, సింగిల్ విండో వైస్ చైర్మన్ నిజానపురం చందు, సింగిల్ విండో చైర్మన్ లు ఎన్నం మనోహర్, శ్రీనివాసరెడ్డి,చొప్పదండి మున్సిపల్ చైర్పర్సన్ వద్దూరి సరిత,వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస, కౌన్సిలర్ లు కనుమల్ల రాజశేఖర్, ఒలుగొత్తుల సురేష్, వద్దూరి శ్యామ్ సుందర్, నాయకులు రాజేందర్, నెరువట్ల మల్లేశం, ఉపసర్పంచ్ కొత్తపల్లి నవీన్, సింగిల్ విండో డైరెక్టర్ లింగంపల్లి దేవదాసు, పెరుక శ్రీనివాస్, కాల్వ అనిల్, లింగంపల్లి మల్లయ్య, ఉదారం వేణు పాల్గొన్నారు.

## రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాజేశ్వర్ రెడ్డి



**చిగురుమామిడి, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):** చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లె గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా కలువల రాజేశ్వర్ రెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అన్నాడి నరసింహారెడ్డి, కార్యదర్శిగా అన్నాడి మల్లికార్జున్ రెడ్డి, కోశాధికారిగా సింగిరెడ్డి మహేందర్ రెడ్డిలతో పాటు పలువురిని డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ నూతన కమిటీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి పలువురు గ్రామస్థులు, సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.



## దుబాయ్‌లో ఎమ్మెల్యే సంజయ్‌కి ఘన స్వాగతం

**కోరుట్ల, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):** కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు దుబాయ్‌లో నివసిస్తున్న కోరుట్ల ప్రాంత ప్రవాసులు ఘనంగా ఆతిథ్యం ఇచ్చారు. అక్కడ నివసిస్తున్న ముజఫర్ భాయ్ ఆధ్వర్యంలో కోరుట్ల వాసులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికి, ఆత్మీయంగా సన్మానించారు. విదేశీ గడ్డపై తమ నియోజకవర్గ ప్రజాప్రతినిధిని కలుసుకోవడంపై ప్రవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశం కోరుట్ల వాసుల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి నిదర్శనంగా నిలిచింది.

## ఎండపల్లిలో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు



**ఎండపల్లి, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):** ఎండపల్లి మండల పరిధిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. కోలాట నృత్యాలు, డీజే చప్పుళ్ల నడుమ దుర్గాదేవి ప్రతిమలను ఆలయాల్లో కొలువుదీర్చి నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల తొలిరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాలు భక్తుల సందడితో, ఆధ్యాత్మిక వాతావరణంతో శోభాయమానంగా మారాయి.

## వైభవంగా అమ్మవారి ఆగమనం



**మేడిపల్లి, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలో దేవీ ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆగమనం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. డప్పు చప్పుళ్లు, కోలాటాల హోరు, సంప్రదాయ కళారూపాలు, విభిన్న వేషధారణలతో నిర్వహించిన శోభాయాత్రలు గ్రామాల్లో కన్నులపండువగా సాగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనలు, భక్తుల ఉత్సాహంతో మండలమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

# కోరుట్లలో తాగునీటి కష్టాలు..

## నల్లా నీళ్ల కోసం ప్రజల ఎదురుచూపులు!

- సక్రమంగా సరఫరా కానటువంటి మిషన్ భగీరథ నీళ్లు
- ప్రజల ఇబ్బందులు పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఫోన్‌లో సంప్రదించినా స్పందించని మున్సిపల్ కమిషనర్
- తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరించాలని పట్టణ ప్రజల డిమాండ్



**కోరుట్ల, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):** కోరుట్ల పట్టణంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. రోజు విడిచి రోజు సరఫరా కావాల్సిన మిషన్ భగీరథ నల్లా నీళ్లు సైతం సక్రమంగా రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత సమయంలో నీటి సరఫరా లేకపోవడంతో నిత్యజీవితంలో తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

### నల్లా నీళ్లు రాక నిత్యకృత్యాలకు ఆటంకం

పట్టణంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా లేకపోవడంతో సమయానికి వంట చేసుకోవాలన్నా, తాగేందుకు నీరు కావాలన్నా తీవ్ర సమస్యగా మారింది. రోజువారీ పనులకు వెళ్లే ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు, మహిళలు నీటి కోసం గంటల తరబడి ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అసలే రోజు విడిచి రోజు సరఫరా చేస్తుంటే, ఆ రోజు కూడా నీళ్లు రాకపోవడంతో నిరాశే మిగులుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఫోన్‌లో సంప్రదించినా స్పందించని కమిషనర్

పట్టణంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై మున్సిపల్ కమిషనర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఎలాంటి స్పందన లభించలేదు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేసినా బాధ్యుల నుంచి సమాధానం రాకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీస అవసరమైన తాగునీటి సరఫరా నిలిచిపోయినప్పుడు అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి సమస్యను పరిష్కరించాల్సింది పోయి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

### తక్షణమే సమస్యను పరిష్కరించాలి

పైపులైన్లలో సాంకేతిక లోపాలు ఉన్నాయా లేదా నీటి విడుదల తగ్గిందా అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. నీటి సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగునీటి కష్టాలు తీర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కోరుట్ల మున్సిపల్ యంత్రాంగం ఇప్పటికైనా తక్షణ ప్రాధాన్యతతో స్పందించి మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

---

# మంగేళలో ఘనంగా బతుకమ్మ చీరల పంపిణీ






- స్వంత ఖర్చులతో చీరలు పంపిణీ చేసిన అశోక్
- ప్రజాసేవే తన జీవిత లక్ష్యమని వెల్లడి

**బీర్‌పూర్, 2026 అక్టోబర్ 11 (ఏక్ దం న్యూస్):** జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలకు ఉచిత చీరల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నారపాక అశోక్ తన స్వంత ఖర్చులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, గ్రామ మహిళలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా నారపాక అశోక్ మాట్లాడుతూ.. పదవులు హోదా కోసం కాదని, ప్రజలకు సేవ చేయడానికి లభించిన గొప్ప అవకాశాలని తెలిపారు. తన ఎదుగుదలకు కారణమైన పుట్టినగడ్డ ప్రజలకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమం చేపట్టానని పేర్కొన్నారు. ఎస్సీ సామాజిక వర్గాల అభ్యున్నతితో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా తన సంపాదనలో కొంత భాగాన్ని నిరంతరం ప్రజాసేవకే వినియోగిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## వృద్ధ తల్లిదండ్రులను నిరాదరిస్తే ఉద్యోగం ఊడుతుంది: సీనియర్ సిటిజెన్స్ హెచ్చరిక

**జగిత్యాల, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):** కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొంది వృద్ధ తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేస్తే సస్పెన్షన్, ఉద్యోగం నుంచి తొలగింపు వంటి కఠిన చర్యలు తప్పవని సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ హెచ్చరించారు. ఫిర్యాదుల నేపథ్యంలో జగిత్యాలలోని సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో ఆదివారం జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్లకు చెందిన పలువురు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అధికారుల హెచ్చరికలతో స్పందించిన ఉద్యోగులు తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత తమదేనని ఒప్పుకుంటూ అఫిడవిట్లు సమర్పించి వారిని వెంట తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కౌన్సిలియేషన్ అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## రేపు రైతు వేదికల్లో సీఎం వీడియో కాన్ఫరెన్స్

**జగిత్యాల, అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి):** తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం ఉదయం 11:30 గంటలకు రాష్ట్ర రైతాంగాన్ని ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించనున్నారని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లాలోని వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఉన్న అన్ని రైతు వేదికల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు పేర్కొన్నారు. పంటల రక్షణ, యాసంగి సాగు ప్రణాళిక, కరువు పరిస్థితులను ఎదుర్కొనే వ్యూహాలపై ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖి నిర్వహించి మార్గదర్శనం చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని, అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో రైతులను సమీకరించాలని కోరారు.

# దేవి ఆగమనం.. భక్తుల కోలాహలం!

- డప్పు చప్పుళ్లు, ఒగ్గు కళాకారుల విన్యాసాలు, యువతుల నృత్యాలు
- ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ఊరు వాడ
- శైలపుత్రి దేవి అలంకారంలో అమ్మవారి దర్శనం
- మల్యాల మండలంలో వైభవంగా ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు



మల్యాల, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):

**మల్యాల మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు "దేవి ఆగమనం" సందర్భంగా అంగడి బజార్ ప్రాంతంలో భక్తుల కోలాహలం అంబరాన్ని అంటింది. డప్పు చప్పుళ్లు, ఒగ్గు కళాకారుల విన్యాసాలు, భక్తి పాటలతో మల్యాల వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.**

### వైభవంగా విద్యుత్ దీపాలంకరణలు

ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు పండుగ వాతావరణాన్ని మరింత శోభాయమానంగా మార్చాయి. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. తొలిరోజే వెల్లువెత్తిన భక్త జనసందోహంతో మండలవ్యాప్తంగా పండుగ సందడి నెలకొంది.











### కనువిందు చేసిన వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు

వీర గోల పట్టి అమ్మవారి భక్తిపాటకు య-ువతులు చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వాగ్దేవి స్కూల్ విద్యార్థులు వేసిన వివిధ రకాల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారి రూపంలో అలరించిన విద్యార్థిని చూసిన ప్రజలు భక్తిపారవశ్యంతో మురిసిపోయారు. ప్రతి దేవి విగ్రహం ఒక్కో ప్రత్యేక అలంకరణతో కనువిందు చేసింది. దేవి ఆగమనానికి ముందు కొందరు భక్తులు పొర్లు దండాలు పెట్టి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

### శైలపుత్రి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

నవరాత్రుల మొదటి రోజున అమ్మవారు శైలపుత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ దివ్య మంగళ రూపాన్ని తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తజనం తరలివచ్చారు. తాటిపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద ఉన్న దేవి మండపం ప్రత్యేక అలంకరణలతో భక్తులను ఆకట్టుకుంది.

## జామా మసీదు నూతన కార్యవర్గం ఎన్నిక



కొడిమ్యాల, అక్టోబర్ 11,(ప్రజాజ్యోతి): మండలంలోని పూడూర్ జామా మసీదు నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహమ్మద్ అబ్దుల్ సత్తర్, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ షాదుల్లా, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ నజీర్, కోశాధికారిగా మహమ్మద్ ఖాజా మోహినుద్దీన్, ముఖ్య సలహాదారులుగా మహమ్మద్ యూసుఫ్, మహమ్మద్ ఇస్మాయిల్, కార్యదర్శులుగా మహమ్మద్ భాషు, మహమ్మద్ ఆల్ రాజ్, గౌరవ అధ్యక్షుడిగా మహమ్మద్ నజీర్, సభ్యులుగా సాజన్, షాదుల్లా, హైమద్, సాదిక్, అలీం, షబ్బీర్, జహూర్ ఎన్నికయ్యారు. మసీదు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



కొడిమ్యాల, అక్టోబరు 11,(ప్రజాజ్యోతి): మండలంలోని నాచుపల్లికి చెందిన జిట్టవేణి మధుసూదన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా విషయం తెలుసుకున్న వన్ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ మహేశ్‌రెడ్డి ఆదివారం మృతుడి తల్లిదండ్రులను పరామర్శించి, కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాండ్రల బాబు, తాళ్లపల్లి వెంకటరావు, బట్టు కిషోర్, పల్లె రాంగోపాల్, కొత్తూరు తిరుపతి పాల్గొన్నారు.

## విస్తృతంగా రెడ్డి సంఘం నాయకుల ప్రచారం



ఇల్లంతకుంట అక్టోబర్ 11(ప్రజా జ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెడ్డి సంఘం ఎన్నికలో పోటీ చేస్తున్న అధ్యక్ష అభ్యర్థి ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి మండలంలోని రెడ్డి సంఘం సభ్యులను కలిసి తనకు మద్దతు ఇచ్చి తన ప్యానల్ అభ్యర్థులను గెలిపియాలని కోరారు తన ప్యానల్ ను గెలిపిస్తే రాష్ట్రంలోనే కరీంనగర్ సంఘాన్ని మొదటి స్థానంలో నిలుపుతానని తెలిపారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి అభ్యర్థి కంది అశోక్ రెడ్డి మండల రెడ్డి సంఘం కార్యదర్శి గడ్డం రవీందర్ రెడ్డి హరికృష్ణ రెడ్డి పండుగు ఎల్లారెడ్డి రాజేందర్ రెడ్డి సునీల్ రెడ్డి శ్రీనివాసరెడ్డి సంతోష్ రెడ్డి వివిధ గ్రామాల రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు